


## గత సంచికనుంచి కొనసాగింపు

అతనికి ఇంకా మగతగానే వుంది. కళ్ళ ముందు కొన్ని, కళ్ళు మూస్తే కొన్ని చిత్రమైన విషయాలు కనపడుతున్నాయి. కళ్ళముందు మబ్బుల్లో గాంధీ.. కళ్ళు మూసుకుంటే కలలోలా సుభాష్ బోస్..!! కళ్ళు తెరిచాడు.

ఎవరో చిన్న పిల్లాడు చాలా దగ్గరగా నిలబడి అతని ముఖంలో ముఖం పెట్టి చూస్తున్నాడు.

“ఎవరు నువ్వు?” పిల్లాడు అడిగాడు.

ఎవరని చెప్పాలి. కనపడ్డ మనిషి గాంధి అని గుర్తుంది. సుభాష్ చంద్రబోస్ ముఖాన్ని గుర్తుపట్టగలిగాడు. కానీ తనే ఎవరో? తన పేరేమిటో? ఎంత ఆలోచించినా గుర్తుకురావటంలేదు. బలవంతంగా ఆలోచించాలని ప్రయత్నిస్తే తలలో వెయ్యి సూదులు గుచ్చుతున్నట్లు బాధగా వుంది.

“నిన్నే... ఎవరు నువ్వు?” పిల్లాడు రెట్టించాడు.

సారథికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఏం చెప్పాలన్నా గుర్తుకురావటం లేదు.

“తెలియదు. ఇదేం వూరు?” అన్నాడు

“సవ్యలంక”

"స-వ్య-లం-క.." ఒక్కో అక్షరాన్ని మనసులోనే మననం చేసుకున్నాడతను. ఆ పేరు ఎక్కడ విన్నట్లుగా అనిపించలేదు. "పోనీలే నాకు తెలిసిన భాషే మాట్లాడుతున్నారు" అనుకున్నాడు. ఏ విషయం గుర్తుకురానప్పుడు భాష ఎలా గుర్తుందా అన్న అనుమానం వచ్చింది కానీ దానికి అంత ప్రాధాన్యత ఇవ్వాలని అనుకోలేదు.

లేచి కూర్చోవాలని ప్రయత్నించాడు. ఒళ్ళంతా భారంగా వుంది. పిల్లవాడు సంకోచిస్తూనే దగ్గరకు వచ్చి సాయంపట్టాడు.

"ఆ సముద్రంలో పడి కొట్టుకొచ్చావా?" అడిగాడు పిల్లాడు అతను లేచి నిలబడిన తరువాత. అప్పుడు అర్థం అయ్యిందతనికి తాను సముద్రం పక్కన ఇసకలో పడివున్నాడని.

"అవును" అన్నాడతను అప్రయత్నంగా. ఆ పిల్లాడు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం ఏదీ తనకు గుర్తులేదు. ఆలోచించాలన్న ప్రయత్నం వల్ల పెద్ద ప్రయోజనమూ వుండట్లేదు. తల బాధ పెంచుకోవడం తప్ప పెద్ద ఉపయోగం వుండదు కనుక ఆ పిల్లాడు ఊహించినదానికి సరే అంటే పోతుంది కదా అనుకున్నాడు.

"నా పేరు నందు" చెప్పాడు పిల్లాడు.

"మంచి పేరు" నవ్వాడతను. "తాగడానికి మంచినీళ్ళు దొరుకుతాయా?" అడిగాడు వెంటనే.

"మా ఇల్లు ఇక్కడికి దగ్గరే... వస్తారా?" అన్నాడు నందు.

"పద"

ఇద్దరూ కదిలారు.

"నీకు గాంధీ తెలుసా?" అడిగాడు దారిలో.

"ఎవరాయన?"

"మన స్వతంత్రం కోసం పోరాటం చేసిన వ్యక్తి. చాలా గొప్ప మనిషి. జాతిపిత" గుర్తు చేసే ప్రయత్నం చేశాడు.

"జాతిపిత అనే పేరున్న వాళ్ళు నాకు ఎవరూ తెలియదు." ఆ పిల్లాడు నడుస్తూనే సమాధానం చెప్పాడు.

"అది పేరు ఆయన పేరు కాదు. ఆయనకు మనం ఇచ్చుకున్న బిరుదు."

"ఎందుకు?"

"భారతదేశానికి ఆయన చేసిన..." సారథి వాక్యం పూర్తి చెయ్యకముందే నందు నడక ఆపి అతని ఎదురుగా నిలబడ్డాడు.

"భారతదేశం అంటే?" అన్నాడు నందు.

"ఇండియా"

"అంటే?" మళ్ళీ అర్థంకానట్లు అడిగాడు నందు.

"మనం ఉండే దేశం" అన్నాడు

"మనం ఉండేది సవ్యలంక అని చెప్పానుగా" నందు కాస్త మొండిగా అన్నాడు

పన్నెండేళ్ళ పిల్లాడికి దేశం పేరు తెలియకుండా వుండటం ఆశ్చర్యకరంగానే వున్నా అదంతగా పట్టించుకోలేదతను. దానికన్నా అతనికి ఆశ్చర్యకరంగా వుంది గాంధీ, భారతదేశం పేర్లు అప్రయత్నంగా తన నోటి నుంచి రావటం. తనెవరో గుర్తు రావటంలేదు కానీ, తన దేశం పేరు, ఆ దేశంలో ఒక వ్యక్తి పేరు గుర్తున్నాయి. సుభాష్ చంద్ర బోస్ పేరు కూడా మెదళ్ళో మెరిసింది. ఆ పేరు కూడా గుర్తుంది.

"సరే... కాస్త త్వరగా వెళ్దామా? నాకు చాలా దాహంగా వుంది" ఎటూ తెగని ఆలోచన అనవసరం అనిపించి అక్కడితో ఆపేశాడు అతను.

నడక సాగుతోంది.

“నీ పేరేంటో చెప్పలేదు నువ్వు” నందు అడిగాడు.

ఏం చెప్పాలో తెలియలేదు. ఏమని చెప్తే ఇంక ఎన్ని ప్రశ్నలు వినాల్సివస్తుందో అని అనుమానం వచ్చింది. కానీ ఏదో ఒకటి చెప్పాలి కదా? అతనికి గుర్తున్న పేర్లు – గాంధీ, సుభాష్ బోస్. క్షణంలో నాలుగోవంతు వచ్చిన ఆలోచన రెండింటిలో ఎవరి పేరు చెప్పాలి? గాంధీ? బోస్?

“బోస్” అన్నాడు అప్రయత్నంగా. అన్న తరువాత తనేదో పెద్ద నిర్ణయం తీసుకున్నట్లు అనిపించసాగింది.

ఆ పిల్లాడు నవ్వి, కనుచూపు మేరలో ఇల్లు కనపడటంతో అటువైపు పరుగుతీశాడు.

’బోస్’ అక్కడి చేరే సరికే అతని గురించి ఇంట్లో పెద్దవాళ్ళకి చెప్పినట్లున్నాడు నందు. ఓ నలభై ఏళ్ళ మనిషి గుడిసె లాంటి ఆ ఇంట్లో నుంచి బయటికి వచ్చి నిలబడ్డాడు. అతని వంటి మీద ఓ ముతక పంచె, చిన్న కండువ తప్ప ఇంకేం లేవు.

“దండాలు బాబూ... తవరు సముద్రంలో కొట్టుకొచ్చినారని మా పిల్లాడు చెప్పాడు. రండి..లోపలికి” అంటూ దారి తీశాడు.

లోపల ఓ మోడాలాంటిది చూపించి కూర్చోమన్నాడు. ఎదురుగా మరో మోడా పైన అతను కూర్చున్నాడు. లోపల గదిలో ఎవరో ఆడవాళ్ళు వున్నట్లు తెలుస్తోంది. అడపదడప గాజుల చప్పుడు.

“మీ పేరు?” అడిగాడు అతను కొద్ది క్షణాల మౌనం తరువాత.

“నా పేరు బోస్. ఈ సముద్రంలో కొట్టుకోని..” పిల్లాడు చెప్పిన కథనే కొనసాగించాలని నిర్ణయించుకున్నాడు బోస్.

“తెలుసు బాబూ... మా అబ్బాయి చెప్పాడు. పడవ మునిగిపోయిందా? ఈదుకుంటూ వచ్చారా?” అతని ప్రశ్నలలో కుతూహలం కన్నా ఆదరణే ఎక్కువ వినపడింది బోస్ కి. అయితే ఇది ఊహించని ప్రశ్న.

“తెలీదండీ. గుర్తులేదు” నిజం చెప్పేశాడు.

“పోన్లెండి. ఇంతకీ ఏ ప్రాంతం తమరిది?”

బోసుకి గుర్తురావటం లేదు. ఏం చెప్పాలో తెలియలేదు.

“ఇండియా... భారతదేశం” అని నవ్వేశాడు. అవతల వ్యక్తి అర్థం కానట్లు చూశాడు.

“అదెక్కడుంది బాబూ?” అడిగాడతను.

బోసు మళ్ళీ ఆశ్చర్యపోయాడు. ఆ వ్యక్తిని కళ్ళార్పకుండా చూశాడు. దేశం పేరు కూడా తెలియకుండా మనుషులు ఈ దేశంలో బతుకుతున్నారంటే అతనికి నమ్మశక్యంగా లేదు. అదే అడగబోతుంటే నందు మంచినీళ్ళ గ్లాసుతో వచ్చాడు. మంచి నీళ్ళు కనపడగానే బోస్ ఆలోచనలన్నీ ఆగిపోయాయి. ఎప్పటి దాహమో కట్టలు తెంచుకున్నట్లు అనిపించింది. పిల్లాడు మంచినీళ్ళ గ్లాసు అందించాడు. బోస్ చెయ్యి పైకెత్తాడు కానీ గ్లాస్ అందుకోలేదు.

“తప్పు నందూ.. ఎడంచేత్తో ఇవ్వకూడదు. కుడిచేత్తో ఇవ్వు..” అన్నాడు.

నందు ఆశ్చర్యంగా చూసి తండ్రి వైపు తిరిగాడు. నందు తండ్రి కళ్ళు రెండింతలయ్యాయి. లోపల్నుంచి వినపడుతున్న గాజుల చప్పుడు ఆగిపోయింది.

నందు నవ్వి అన్నాడు – “ఏం కాదు. ఎవరికైనా ఏదైనా ఇవ్వాలంటే ఎడమ చేత్తోనే ఇవ్వాలని మా అమ్మ నేర్పించింది”

“తప్పు నందూ... కుడిచేతితో ఇవ్వమని చెప్పుంటుంది. కుడిచేత్తోనే ఇవ్వాలి” బోస్ సర్ది చెప్పాలని చూశాడు.

నందు తండ్రి ఒక్కసారిగా నిలబడి, అతను కూర్చున్న మోడాని వెనక్కి తన్నాడు.

"లే... ముందు లే ఇక్కడ్నుంచి! చిన్నపిల్లాడితో ఇట్టాటి తప్పుడు మాటలు మాట్లాడేదానికి నీకు సిగ్గుగా అనిపించడంలేదా? లేకపోతే నువ్వు కూడా ఆళ్ళల్లో ఒకడివా? ఫో... వెళ్ళిఫో ఇక్కడ్నుంచి..." గట్టిగట్టిగా అరుస్తూ గుమ్మం వైపు చెయ్యి చూపిస్తున్నాడతను. క్షణంపాటు బోసుకి ఏమీ అర్థం కాలేదు.

"అదేంటండీ... నేను చెప్పినదాంట్లో తప్పేముంది? కుడి చెయ్యే కదా వాడాలి.."

"నోర్ముయ్... ముక్కు ముఖం తెలియనోడివైనా పోన్లెమ్మని దయతో ఇంటోకి పిలిస్తే ఇదా నువ్వు చేసేది? నా నట్టింట్లో కూర్చొని ఇట్టాటి మాట్లాడటానికి ఎంత ధైరం? ముందు లే ఇక్కడ్నుంచి... లే.."

బోసు లేచాడు. నందు తల్లి అప్పటికే తలుపు సందులో నుంచి జరుగుతున్న ప్రహసనాన్ని గమనిస్తోంది.

"సరే వెళ్తున్నాను... మీరు ప్రేమగా మాట్లాడితే అదంతా మీ మంచితనం అనుకున్నాను. మీకు దాంతోపాటు కొంచెం పిచ్చి కూడా వున్నట్లుంది. వస్తా" అంటూ విసురుగా అక్కడ్నుంచి కదిలాడు.

2

బోసుకి ఆశ్చర్యంగా వుంది. చాలా వింతగా అనిపించసాగింది. తనేదైనా వింత లోకంలోకి వచ్చి పడ్డానా అని కొంతసేపు అనుమానపడ్డాడు.

మొదట తనెవరో తనకి తెలియటంలేదు. ఎక్కడున్నాడో తెలియదు. గాంధీ, బోస్, భారతదేశం మినహా ఇంకేమీ గుర్తుకురావటం లేదు. కానీ ఆ దేశం పేరే తెలియనట్లు ప్రవర్తించే కుటుంబం విచిత్రంగా అనిపించింది.

అన్నింటినీ మించి ఆ ఇంటి యజమాని చేసిన హంగామా తల్చుకుంటే ఆశ్చర్యాన్ని మించి నవ్వొస్తోంది. ఇంటికి వచ్చిన మనిషిని మంచినీళ్ళు కూడా తాగనివ్వకుండా వెళ్ళగొట్టాడు. అది కూడా కుడిచెయ్యి వాడమని చెప్పినందుకు. ఎంత ట్రివియల్ గా వుందో... ట్రివియల్... ట్రివియల్... ఎక్కడో విన్నట్లు వుందా పదం. చాలా దగ్గర మనిషి ఎవరో అన్నట్లు జ్ఞాపకం వస్తోంది. ఆలోచన మాత్రం ముందుకు సాగటం లేదు.

దాహం..!! ఇందాక గొడవలో పడి అతను మంచినీళ్ళు తాగలేదు. అవతలి మనిషి కూడా తీవ్రంగా మాట్లాడుతూ బోస్ ని నీళ్ళు తాగనివ్వలేదు. బయటికి వచ్చిన తరువాత నీళ్ళు దొరికే ప్రదేశం కోసం వెతుకుతూ వడివడిగా నడవసాగాడు. ఒక్క క్షణం ఆ గ్లాసెడు నీళ్ళు తీసుకోని తాగేసివుంటే బాగుండేదేమో అనిపించింది. అంతలోనే "అలా ఎలా చేస్తాను" అనుకున్నాడు. ఎడమ చేత్తో ఇవ్వడం అంటే అవమానించడమే కదా! అని సర్దిచెప్పుకున్నాడు.

టంగ్.. మంటూ గంట శబ్దం వినపడటంతో ఉలిక్కిపడ్డాడు బోసు. నడుస్తున్నవాడు నిలబడి చుట్టుపక్కల చూశాడు. అప్పుడు అతను సరిగ్గా ఏదో గుడి ముఖద్వారం దగ్గర వున్నాడు. ఏమీ ఆలోచించకుండా లోపలికి అడుగుపెట్టాడు.

విశాలంగా వుందా గుడి. ఒక మూల ప్రసాదాలు పెడుతున్నారు. ఆ చుట్టుపక్కలే ఎక్కడోక్కడ మంచి నీళ్ళు వుంటాయని వెతికాడు. గోడవారగా మంచినీళ్ళ ట్యాప్ లు కనపడ్డాయి. అంగలు వేసుకుంటూ వెళ్ళి గబగబా నీళ్ళు తాగాడు. దాహం తీరడంతో ఒక్కసారి అక్కడే కూలబడిపోయాడు. ఓ రెండు నిముషాలు తేరుకున్నాక అతని కడుపులో ఆకలి మొదలైంది.

చుట్టూ చూస్తే ఎర్రటి బట్టలు వేసుకున్న ఓ నలభై ఏళ్ళ వ్యక్తి కనపడ్డాడు. జడలు కట్టిన అతని జుట్టు, అతని ముఖంలో ప్రశాంతత చూసి బహుశా ఆయన ఆ గుడిలో అర్చకుడై వుంటాడనిపించింది. ఆయన కన్నా ఆయన పెడుతున్న ప్రసాదం బోసుని ఆకర్షించింది. దగ్గరకు వెళ్ళి ప్రసాదం కోసం చెయ్యి చాచబోయాడు.

"గుళ్ళోకి వెళ్ళి దర్శనం చేసుకోని రండి బాబూ. పెడతాను" అన్నాడాయన ముఖంలో ప్రశాంతత చెరగకుండా.

బోసు తలుపి గుళ్ళోకి వెళ్ళాడు. పల్చగా జనం వున్నారు. లోపల వున్న విగ్రహం దేవుడిదని అని తెలుస్తూనే వుంది కానీ అది ఏ దేవుడో తెలియటంలేదు. శరీరం మనిషిది తల మాత్రం పులిది. పెద్ద తోక వుంది. ఆ తోకతో ఒక కత్తిని పట్టుకోని వున్నాడు. కుడి చేతిని కిందకు దించి ఆ చేత్తో ఒక మనిషి తలను పట్టుకోని వున్నాడు. ఎడమ చేతిని పైకి లేపి ఆ చేతిలో ఏదో పాత్రను పట్టుకోని వున్నాడు. ఆ దేవుడు నిజంగా తనకి తెలియని దేవుడా లేక తెలిసి మర్చిపోయిన దేవుడా అని అర్థం కాలేదు.

అక్కడే ఒక పక్కగా ఒక కంచు పళ్ళెం వేలాడదీసి వుంది. గుళ్ళోకి వచ్చినవాళ్ళు అక్కడికి వెళ్ళి దాని మీద తలతో మోది వెళ్తున్నారు. ఆ తరువాత వాళ్ళు కొంచెం అవతలగా వున్న కుర్రాడి దగ్గరకు వెళ్తున్నారు. అతను కూడా ఎర్రటి బట్టలు వేసుకోని వున్నాడు. అతని తల కూడా జడలు కట్టి వుంది. అతని చేతిలో చిన్న కట్టె వుంది. దాని చివరన ఏదో జంతువు జూలు కట్టి వుంది. దానిని పక్కనే వున్న పెద్ద గిన్నెలో ముంచి వచ్చిన వాళ్ళ తల మీద చిన్నగా మోదుతున్నాడు. ఆ తరువాత అందులో వున్న నీళ్ళను శంఖంతో తీసి తాగడానికి వాళ్ళ చేతుల్లో పోస్తున్నాడు. ఈ వ్యవహారం అంతా కొత్తగా అనిపించినా తనకి ఏదీ గుర్తులేకపోవటం తల్చుకోని ఆ ప్రకారమే నడుచుకోవాలని అనుకున్నాడు.

చకచక ముందుకు నడిచి కంచు పళ్ళానికి తల మోది ఆ కుర్రాడి ముందు తల వంచాడు. అతను తడి జూలు కట్టెతో చిన్నగా మోదిన తరువాత, అతను శంఖంతో పోసే నీటి కోసం చేతిని చాచి కుర్రడి ముఖంలోకి చూశాడు. పదహారు పదిహేడేళ్ళు వుంటాయేమో అతనికి. బయట కనపడ్డ వ్యక్తి పోలికలు కనపడటంతో బహుశా ఆయన కొడుకై వుంటాడని అనిపించింది. కాని ఆ పిల్లాడు ముఖంలో ప్రశాంతత లేదు. అతని కళ్ళలో ఏదో బెరుకు కనపడింది. క్రమ క్రమంగా అతని ముఖం మొత్తం భయంతో పాలిపోయినట్లైంది. ఒక్క క్షణం తడబాటు తరువాత ఒక్కసారిగా అతను చేతిలో వున్న జూలు కట్టెను వదిలేసి గుడి బయటికి పరుగెట్టాడు.

“నాన్నగారూ.. నాన్నా..” అంటూ అరుపులు మాత్రం వినపడ్డాయి బోసుకి.

అతనికి ఏమీ అర్థం కాలేదు. చేతిలో శంకునీరు పొయ్యకుండా అతను ఎందుకు అలా పరిగెట్టాడా అని ఆలోచించాడు కానీ అంతుపట్టలేదు. గర్భగుడిలో నుంచి బయటకు వచ్చాడు. ఎదురుగా వున్న దృశ్యం చూసి మరింత ఆశ్చర్యపోయాడు.

ఏడుగ్గురు అర్చకులు. అంతా ఒకే రకంగా జడలు కట్టిన జుట్టుతో, ఎర్రటి బట్టలు కట్టుకోని వున్నారు. అంతా ఒక మూలగా నక్కి నిలబడ్డారు. అందరూ చేతులు జోడించి వున్నారు. బోసు వాళ్ళ వైపు అడుగులు వేస్తుంటే అందరూ భయంతో వణికిపోయారు. ఇందాక ప్రసాదం పెడుతున్న పెద్దాయన అతి కష్టం మీద గొంతు పెగల్చుకున్నాడు.

“స్వామీ... మిమ్మల్ని వేడుకుంటున్నాము. మమ్మల్ని ఏమీ చేయకండి. పిల్లలు కలవాళ్ళం” అన్నాడు. ఇంతక ముందు కనపడ్డ ప్రసన్నత స్థానంలో భయం, ఆందోళన మత్రమే అతని ముఖంలో కనపడుతోంది. దాదాపు ఏడ్చేస్తున్నాడు ఆయన.

“అదేమిటి స్వామీ. మీరు నన్ను చూసి ఎందుకు భయపడుతున్నారు? నేను మిమ్మల్ని ఏమీ చెయ్యను. అసలు నేనేదో చేస్తానని మీరెందుకు అనుకుంటున్నారు?” ఆశ్చర్యంగా అడిగాడు బోసు.

“మీరు శంకునీరు తాగడానికి చెడ్డ చేతిని చాచారు. ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి?” లోపల కనపడ్డ కుర్రాడు కాస్త ధర్యం చేసుకోని చెప్పాడు.

“అవును. కుడి చెయ్యి వాడాను... అయితే..” అని ఇంకేదో అనబోయి ఆగిపోయాడు. మళ్ళీ కుడిఎడమల ప్రస్తావన. ఇదేదో విచిత్రమైన వ్యవహారంలా అనిపించింది. చిన్న ఆచారివైపు తిరిగి సైగ చేసి దగ్గరకు రమ్మన్నాడు. అతను ముందు భయపడ్డా ఒక మొండి ధైర్యంతో నెమ్మదిగా అడుగులు ముందుకేశాడు. వెనక వున్న ఆరుగ్గురు ఘొల్లుమన్నారు.

“మీ గొడవ నాకు అనవసరం. ఆకలిగా వుంది ప్రసాదం పెట్టు” అడిగాడు బోసు.

“అలాగే” అంటూ మంత్రించబడిన మనిషిలా ప్రసాదం గుండిగ దగ్గరకు నడిచాడు చిన్న అచారి. అందులో వున్న పొంగలి తీసి పట్టమన్నట్లు బోసు వైపు చూశాడు. బోసు కుడి చెయ్య చాచాడు. చిన్న ఆచారి ప్రసాదం పెట్టాడు.

ఎ-డ-మ-చే-తి-తో...!!

ప్రసాదం ఎడమచేతితో పెట్టడం కాస్త ఇబ్బందిగా అనిపించినా, ఆకలి వల్ల దాన్ని పట్టించుకోలేదు. ఆవురావురని తిన్నాడు. మళ్ళీ నాలుగు గుక్కల నీళ్ళు తాగాడు. తృప్తిగా పొట్ట నెమురుకోని, నిటారుగా నిలబడ్డాడు.

అతను చేస్తున్న ప్రతి పనినీ చాలా జాగ్రత్తగా గమనిస్తూ నిలబడ్డారు అర్చకులు. వారి ముఖంలో భయాందోళనలు మాత్రం అలాగే వున్నాయి. కడుపు నిండటంతో ఇప్పుడు ఆలోచనకు తీరిక దొరికినట్లైంది బోసుకి. అసలేం జరుగుతోందో తెలియని అయోమయంలో వున్న సంగతి బోసుకి అర్థమైపోయింది. ఈ కుడిఎడమల గొడవేమిటో, భారతదేశం అంటే తెలియని మనుషులు ఎందుకున్నారో, ఈ అర్చకులు తనని చూసి ఎందుకు భయపడుతున్నారో... ఎన్నో ప్రశ్నలు అతని మనసులో దట్టంగా కమ్ముకోసాగాయి. వాటికి సమాధానాలు తెలుసుకోడానికి అర్చకులతో మాట్లాడాలని అనుకున్నాడు. వాళ్ళవైపు అడుగులు వెయ్యసాగాడు.

బోసు వాళ్ళ వైపు వస్తున్నాడని తెలియగానే అర్చకులంతా భయంతో ఒకరినొకరి కరుచుకోని గోడవారగా కూలబడిపోయారు. చేతులు జోడించి దీనంగా అర్థించడం మొదలుపెట్టారు.

బోసు ఆశ్చర్యంగా అక్కడే నిలబడిపోయి వాళ్ళ వైపు చూడసాగాడు. అయితే అంతకన్నా ఆశ్చర్యకరమైన సంఘటన ఆ వెంటనే జరిగింది. ఎవరో నలుగురు వ్యక్తులు ఒక్కసారి బోసు మీద పడి రెండు చేతుల్ని వెనక్కి విరిచి, పట్టుకున్నారు

“ఏయ్.. ఎవరు మీరంతా? ఏం జరిగితోంది?” అరిచాడు బోసు. వెనుకనుంచి పట్టుకున్న వ్యక్తుల్లో ఒకతను ముందుకొచ్చాడు. ముదురు ఆకుపచ్చ రంగు బట్టలు వేసుకోని వున్నాడు. తనని పట్టుకున్న మనుషులు కూడా అదే రంగు బట్టలు కట్టుకున్నారని గుర్తించాడు బోసు.

“నిన్ను బంధిస్తున్నాం” ప్రకటించాడతను.

మూల నిలబడ్డ ఆచార్యులు అందరూ కాస్త కదిలి సర్దుకున్నారు. ఏదో గొప్ప ప్రమాదం తప్పిపోయి, ప్రాణాలు దక్కినట్లు దేవుడికి దణ్ణం పెట్టుకున్నారు.

బోసుని పట్టుకున్న నలుగురు వ్యక్తులు అతనిని బలవంతంగా ముందుకు తోశారు.

“ఎందుకు బంధిస్తున్నారో చెప్పి బంధించండి” అరిచాడు బోసు.

యూనిఫారం వ్యక్తి బోసు ముఖానికి దగ్గరగా ముఖం పెట్టి గారపట్టిన పళ్ళు బయటపడేలా నవ్వాడు.

“ఎందుకో చెప్పాలా? అయితే విను – పవిత్రమైన గుడిలో శంకునీరు తాగడానికి తప్పుడు చెయ్యి చాపినందుకు. ధర్మపరిరక్షకులైన ఆచార్యులని చంపాలని ప్రయత్నించినందుకు. ధర్మగ్రంధంలోని నలభై మూడొవ ధర్మం, అరవై ఒకటవ ధర్మం ప్రకారం నిన్ను ఉరితీయాలి. అందుకే నిన్ను బంధిస్తున్నాను. చాలా ఇంకేమన్నా కావాలా?” అడిగాడు.

బోసు చేతులకు సంకెళ్ళు వేశారు. అతనికి మాట్లాడే అవకాశం లేకుండా నోటికి గుడ్డకట్టారు. అతన్ని ముందుకు తోస్తూ ఆ వెనకే నలుగురు సైనికులు నడుస్తూ గుడి బయటకు వచ్చారు. బయట వున్న జనాన్ని పక్కకు తొలగిస్తూ వాళ్ళు నగరంలోకి సాగిపోయారు.

**(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)**

COMMENTS